
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5

సిద్దిపేట

శనివారం 31 ఆగస్టు 2024

డెంగీతో మహిళ మృతి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 30 : డెంగీతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం, తడకపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుతారి కనకలక్ష్మి (28)కు సుమారు రెండు నెలల క్రితం డెంగీ జ్వరం రావడంతో మొదట సిద్దిపేటలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో పది రోజులు చికిత్స అందించారు. అయినా తగ్గకపోవడంతో హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. గురువారం రాత్రి పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది.



ఏడాదిలో నలుగురు..

సిద్దిపేట మున్సిపాలిటీకి కమిషనర్‌ల కరువు

- ఇన్‌చార్జిలతోనే కాలం వెళ్లదీత
- పెండింగ్‌లోనే పనులు, కీలక ఫైళ్లు
- తాజాగా కల్వకుర్తి కమిషనర్‌ను ఇక్కడికి..
- ఆయనా వస్తారో.. రారో అని చర్చ

సిద్దిపేట టౌన్, ఆగస్టు30: జాతీయ స్థాయిలో పలు రంగాల్లో అవార్డులు సాధించిన సిద్దిపేట మున్సిపాలిటీకి కమిషనర్లు కరువయ్యారు. గడిచిన ఏడాది కాలంలో సిద్దిపేట మున్సిపాలిటీలో పలువురు కమిషనర్లు బదిలీ కాగా ఇన్‌చార్జిలతో ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నది. సిద్దిపేట మున్సిపల్‌లో పూర్తి స్థాయిలో కమిషనర్ లేకపోవడంతో మున్సిపాలిటీ పరిధిలో పనులు పడకేశాయి. సాధారణ బదిలీ ప్రక్రియలో సిద్దిపేట మున్సిపాలిటీకి జీహెచ్ఎంసీ నుంచి ఇటీవలే ఓ మహిళా కమిషనర్‌ను నియమించడంతో ఆమె బాధ్యతలు తీసుకోలేదు. దీంతో గురువారం సిద్దిపేట మున్సిపల్‌కు కమిషనర్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ కమిషనర్ కూడా వస్తారా, రారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాదిలో నలుగురు కమిషనర్లు..

సిద్దిపేట మున్సిపాలిటీకి ఈ ఏడాదిలో ఫిబ్రవరి 15 వరకు కమిషనర్‌గా కొనసాగిన సంపత్‌కుమార్ నల్గొండకు బదిలీ కావడంతో ఆ స్థానంలో మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.ప్రసన్నరాణి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అయితే కొన్ని నెలలకే సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ తమను పట్టించుకోవడం లేదని, కౌన్సిలర్లకు కనీస మర్యాదా ఇవ్వడం లేదని పలువురు కౌన్సిలర్లు సమావేశంలో ఆమెను నిలదీశారు. దీంతో ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలో భాగంగా ఆమె ఆగస్టు 1న వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేయించుకున్నారు. తర్వాత జీహెచ్ఎంసీలో కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంధ్యారాణిని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా జూలై 30న ప్రభుత్వం బదిలీ చేయగా, ఆమె బాధ్యతలు తీసుకోలేదు. దీంతో గత నెల రోజుల నుంచి సిద్దిపేట డీఈ ప్రేరణ పాండే ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గురువారం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌గా కల్వకుర్తి కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కనిపించని సమావేశాలు..

గతంలో సిద్దిపేట పట్టణ అభివృద్ధిపై ఏం చేస్తే బాగుంటుంది అనే కోణంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించేవారు. కొన్ని నెలల నుంచి కౌన్సిల్ సమావేశాలే తప్ప పట్టణ అభివృద్ధిపై పెద్దగా సమావేశాలు నిర్వహించిన దాఖలాలేవీ కనపడటం లేదు. కమిషనర్లు ఉన్నప్పుడు ఉదయం శానిటేషన్ కార్మికులతో సమావేశం నిర్వహించి పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలని అందుకు వీలుగా సలహాలు సూచనలు అందించేవారు. దాంతో పాటుగా పట్టణ అభివృద్ధి పలు పథకాలపై అధికారులు, ఆర్పీలు, సిబ్బందితో సమావేశం నిర్వహించేవారు. కొంతకాలంగా ఇలాంటి సమావేశాలు మచ్చుకైనా కనబడటం లేదు. పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే పూర్తి స్థాయిలో కమిషనర్లను నియమించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆయన వస్తారా.. రారా..

నెల నుంచి పూర్తిస్థాయిలో కమిషనర్ లేకపోవడంతో పలు సమస్యలు, పెండింగ్ ఫైల్స్ పేరుకుపోతున్నాయి. దాంతో పాటు పట్టణంలో శానిటేషన్ నిర్వహణ, ఉద్యోగులతో అభివృద్ధిపై సమావేశాలు లేకపోవడంతో వారు ఆడింది ఆట, పాడింది పాట అన్నట్లు సాగుతున్నది. అంతేకాకుండా ఇక్కడకు కమిషనర్‌గా ఆశ్రిత్‌కుమార్ వస్తారా, రారాఅనే చర్చ జోరుగా సాగుతున్నది. పట్టణం అభివృద్ధి కుంటు పడిపోకుండా ఉండాలంటే పూర్తి స్థాయిలో కమిషనర్ అందుబాటులో ఉంటేనే అది సాధ్యమవుతుంది.





ఎడ్లబండ్లు ఊరేగింపుగా తీసుకువస్తున్న రైతులు

ఘనంగా మహంకాళీ బోనాలు

- ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ఊరేగింపు

చేర్యాల, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని మహంకాళీ అమ్మవారికి బండ్ల బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం రైతులు తమ ఎడ్లబండ్లతో వీధులగుండా ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేశారు. పంబాలవారు పోతరాజు వేషధారణతో వీరంగమాడి బలి ఇచ్చిన అనంతరం వీధులగుండా ప్రదర్శన చేపట్టారు.



పింఛన్ పాట్లు

- మధ్యాహ్నం 2 గంటలు దాటినా రాని పోస్ట్‌మన్
- ఉదయం నుంచి సాయంత్రం దాకా పడిగాపులు

వర్గల్, ఆగస్టు 30: గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద సుమారు వందమంది వృద్ధులు పింఛన్ కోసం శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 2 గంటలు దాటినా పింఛన్ పంపిణీ చేసే పోస్టుమన్ రాలేదు. దీంతో గ్రామపంచాయతీ ఆవరణలో కొందరు వృద్ధులు నేలపై పడుకోగా,కొందరు అరుగులపై ఆయాస పడుతూ కూర్చున్నారు.

కళ్లు కాయలు కాస్తున్నాయి..



పింఛన్ కోసం ఉదయం వచ్చాం. మధ్యాహ్నం 2 గంటలు దాటినా పింఛన్ ఇచ్చే వ్యక్తి రాలేదు. అతని కోసం చూసి చూసి కళ్లు కాయలు కాశాయి.

\- రంగ దుర్గయ్య

ప్రతిపాదనలతోనే సరి

- దుబ్బాక అభివృద్ధికి నిధులేవి మరీ..?
- రెండేళ్లుగా రూ.10 కోట్ల చుట్టే అధిపత్యపోరు
- అభివృద్ధి పనులకు రాజకీయ గ్రహణం
- అయోమయంలో దుబ్బాక మున్సిపాలిటీ

దుబ్బాక, ఆగస్టు 30: దుబ్బాక రాజకీయ ఆధిపత్యపోరుకు వేదికగా మారి రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా.. నిధుల మంజూరులో జాప్యం జరుగుతుండటంతో ఆ నిధులు ఇతర పనులకు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతున్నది. దుబ్బాక మున్సిపాలిటీకి గత ప్రభుత్వం 2023లో రూ.10 కోట్లను టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరు చేసింది. అందులో రూ.3 కోట్లతో హబ్షీపూర్ రహదారి విస్తరణకు ప్రతిపాదించారు. 20 వార్డుల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా 2020లో రూ.20 కోట్లను సీఎం ప్రత్యేక నిధుల కింద మంజూరు కాగా, అందులో పనులు కాకుండా మిగిలిన రూ.6 కోట్లకు 2023లో తిరిగి ప్రతిపాదనలు పంపారు. ఈ నిధుల్లో రూ.2 కోట్లతో టౌన్‌హాల్, రూ.కోటి గ్రంథాలయానికి, రూ.70 లక్షలతో శ్మశానవాటికలు, రూ.50లక్షలు రామసముద్రం నుంచి చెరువునుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వరకు రింగ్‌రోడ్డుకు ఫార్మేషన్‌కు, రూ.25లక్షలతో ప్రెస్‌క్లబ్ తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపగా, గత ప్రభుత్వం మంజూరు చేసింది. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ నిధులను ఆపేశారు. కొన్ని టెండర్ ప్రక్రియ వరకు వచ్చి నిలిచిపోయాయి. అనంతరం ప్రభుత్వం మారడంతో మంజూరైన నిధులకు సంబంధించిన ప్రతిపాదనలను రద్దు చేసింది. ఈ ప్రతిపాదనలకు ముందడుగు పడకపోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. ఇక్కడ విపక్ష ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండడంతో నిధుల మంజూరుకు మోకాలడ్డుతున్నట్లు ఎమ్మెల్యే అనుచర వర్గం ఆరోపిస్తున్నది. కలెక్టర్ గత ప్రతిపాదనలను రద్దు చేస్తూ, కొత్త ప్రతిపాదనలకు ఆదేశాలిచ్చారు. దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి గతంలో శంకుస్థాపన చేసిన స్థలంలో రూ.4.50 కోట్లతో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. అదే స్టేడియానికి రూ.50లక్షలు సోలార్ పెన్సింగ్, రూ.1.72 కోట్లు బీటీ రోడ్డుకు, మరో కోటి రూపాయాలు గ్రంథాలయం, రూ.1.36 కోట్లు దుబ్బాక చుట్టూ సోలార్ దీపాలు బిగించడానికి ప్రతిపాదించారు. అంతేగాక రుషివనం నుంచి దుంపలపల్లి రహదారికి రూ.1.61కోట్లు, రామసముద్రం సుందరీకరణకు రూ.50లక్షలు, సీసీ రహదారులు, మురుగు కాలువలకు రూ.4కోట్లపై చిలుకు ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం మారగానే ప్రాధాన్యతలు మారడం సహజమైనప్పటికీ.. ఆరునెలలుగా ప్రతిపాదిత నిధులు, అభివృద్ధి పనులకు మోక్షం లేకపోవడంతో పలు విమర్శలకు దారితీస్తుంది. రాజకీయ కారణాలతోనే నిధుల మంజూరును నిలిపివేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదేమైనా దుబ్బాక అభివృద్ధిపై ఆదిపత్యపోరుతో రాజకీయ గ్రహణం పట్టవద్దని ప్రజలు కోరుతున్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి నిధులివ్వాలని కోరుతున్నారు.



అధ్వానంగా మారిన మురికి కాలువ



నిధులు లేక నిలిచిపోయిన మురికికాలువ పనులు

ఆశల పత్తి

- పంటకు అనుకూలంగా వానలు
- పెద్దగా ఆశించని చీడపీడలు
- మంచి దిగుబడులు వస్తాయన్న ఆశలో రైతన్నలు

గజ్వేల్, ఆగస్టు 30: సిద్దిపేట జిల్లాలో పత్తిపంట రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. ఆరుతడి పంటైన పత్తికి అవసరమైనట్లు అడపదడప కురుస్తున్న వర్షాలతో పత్తికి కలిసివస్తోంది. అదునుకు విత్తనాలు నాటడంతో ఎలాంటి చీడపీడల బెడద లేకుండా ఏపుగా పెరుగుతూ ప్రస్తుతం గూడ కట్టి పూతకు వస్తోంది. ఇప్పటివరకు పంట బాగుందని, పరిస్థితులు ఇలాగే కొనసాగితే పత్తిలో మంచి దిగుబడులు రావడంతో పాటు ఆశించిన ధర లభిస్తుందనే ఆశాభావాన్ని ఇటు రైతులు, అటు అధికారులు వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తుండటంతో రెట్టింపు ఉత్సాహంగా సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా గులాబీ చీడ, ఇతర చీడపీడలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

లక్ష ఎకరాల్లో సాగు..

జిల్లాలో రెండవ స్థానంలో పత్తి పంట సాగవుతోంది. చాలా మంది రైతులు తమ సొంత చేన్లతో పాటు కౌలుకు భూములు తీసుకొని పత్తి సాగు చేపట్టారు. మొదట్లో ఆశించిన స్థాయిలో వర్షం పడకపోవడంతో రైతులు కాస్త ఇబ్బందులు పడినా అనంతరం కురిసిన వర్షాలకు పత్తి పంట కుదురుకుంది. జిల్లావ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో లక్ష ఎకరాల్లో పత్తి సాగవుతోంది. గతేడాది ఆశించిన దిగుబడులు రాకపోవడం, పత్తికి ఆశించిన ధర లేకపోవడంతో రైతులు కొంత మేర ఆసక్తి చూపకున్నా నీరులేని రైతులు పత్తి వైపే మొగ్గు చూపారు. ఈ ఏడాది సైతం కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధరను క్వింటాలుకు రూ.501 పెంచింది. గతేడాది రూ.7020గా ఉన్న పత్తి ధర ప్రస్తుతం రూ.7521లకు ధర పెరగడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ పెట్టుబడికి తగిన మద్దతు ధర దక్కడం లేదని, రూ.10వేల పైచిలుకు మద్దతు ధర ఉంటేనే రైతులకు నష్టం రాదని రైతన్నలు చెబుతున్నారు.



అనుకూలంగా వాతావరణం..

ఆరుతడి పంటైన పత్తికి ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉంది. అతివృష్టి, అనావృష్టి కాకుండా అప్పుడప్పుడు వానలు కురుస్తుండటం పత్తి పంటకు కలిసి వస్తోంది. ఎక్కువ వర్షం వస్తే చేలు జాలు వారి మొక్కల పెరుగుదల ఉండకపోవడంతో పాటు ఎరుపు రంగుకు మారిపోతాయి. కలుపుతోపాటు చీడపీడల బెడద అధికంగా ఉంటుంది. మోస్తరు వర్షాలతో పంట పొలాల్లో ప్రస్తుతం గుంటుకలు, కలుపుతీతలు నడుస్తున్నాయి. ఎరువులు వేసుకొని, పూత నిలిచేందుకు మందులు పిచికారి చేస్తున్నారు. మొదటి రెండు నెలలు వాతావరణం అనుకూలిస్తే పత్తి పంటకు ఢోకా ఉండదని రైతులంటున్నారు. పొడి వాతావరణం ఉంటే చీడపీడలు కూడా అంతగా ఆశించవని చెబుతున్నారు. ప్రస్తుతం పనులన్ని అదనులోగా పూర్తవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో, చీడపీడల నుంచి పంటను రక్షించుకుంటే ఈసారి దిగుబడులు భారీగా చేతికి వస్తాయని రైతులు ఆశిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

- గణేష్ మండపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి
- మత్తు పదార్థాల నివారణకు చర్యలు
- సీపీ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 30: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సూచించారు. శనివారం కమిషనర్ కార్యాలయంలో ఆమె పోలీస్ అధికారులతో పెండింగ్ కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోజు సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించాలన్నారు. బ్లాక్ స్పాట్ల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా సైనింగ్ బోర్డులు, స్టైడ్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్ సేఫ్టీ కమిటీ మెంబర్లతో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వినాయక చవితి, గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా పీస్ కమిటీ మీటింగులు ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ మండపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. గంజాయి కేసుల్లో ఉన్న నిందితులపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయాలని, పెండింగ్‌లోని ఓఈలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్లో, ప్రభుత్వ ప్రైవేటు మెడికల్ కళాశాల వద్ద పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పేకాట, జూదం, తదితర వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, సామాజిక రుగ్మతల గురించి విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవీందర్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఐటీ కోర్ ఎస్ఐ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమైక్య అధ్యక్షులకు డ్రెస్ కోడ్

- రిటైర్డ్ ఉద్యోగులకు చికిత్స ఇప్పిస్తా : మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఆగస్టు 30: గ్రామ సమైఖ్య అధ్యక్షులకు డ్రెస్ కోడ్ అమలు చేస్తామని, దానికి అయ్యే ఖర్చులు తానే భరిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో నియోజకవర్గ స్థాయి గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని 33 గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వ్యవసాయ అధారిత స్కీమ్‌లను ప్రతి మహిళా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మను చౌదరి, కరీంనగర్ కలెక్టర్ పమేళా సత్పతి మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఫిషరీస్ డైరెక్టర్ ప్రియాంక, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో వసతి మండపం..

తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆయన తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ జ్ఞాపకార్థం భక్తుల వసతి మండపానికి భూమి పూజ చేశారు. మార్కండేయ ఆలయంలో కలెక్టర్ మనుచౌదరితో కలిసి పద్మశాలీ కమ్యూనిటీ హాల్, ఎల్లమ్మ ఆలయ ప్రహరీ, ఎల్లమ్మ చెరువు వద్ద పార్క్, మినీ స్పోర్ట్స్ హాల్, సిద్దేశ్వర గుట్ట ఆలయ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు పట్టణంలోని సింగిల్ విండో నూతన భవనానికి పూజలు చేసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి తదితరులు ఉన్నారు.



మహిళా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎస్‌జీటీ కేసు విత్‌డ్రా చేసుకోగానే గౌరవెల్లికి నీళ్లు..

గౌరవెల్లి ప్రాజెక్టుపై ఎన్‌జీటీ కేసు విత్‌డ్రా చేసుకోగానే అందులో నీళ్ల నింపుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం రాత్రి రిటైర్డు ఉద్యోగుల ఆత్మీయ సన్మాన సభలో మాట్లాడారు. 45 ఎకరాలకు సంబంధించి ఎన్‌జీటీకి వెళ్లిన శంకర్‌రెడ్డి ఇంటికి అందరం వెళ్దాం. కేసు విత్‌డ్రా చేసుకోమని బతిమిలాడుదామన్నారు. ఆయన ఒప్పుకునేవరకు అక్కడే ఉందాం' అన్నారు. రిటైర్డు ఉద్యోగులకు ఆరోగ్య రీత్యా సమస్యలు ఉంటే చికిత్స ఇప్పిస్తానన్నారు. నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, రిటైర్డు ఉద్యోగుల నాయకులు జగ్గారావు, వీరసోమయ్య, చిట్టి దేవేందర్‌రెడ్డి, వరియోగుల సుదర్శనస్వామి, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, జేఏసీ నాయకులు తదితరులున్నారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయంలో మత్స్య శాఖపై సమీక్ష నిర్వహించారు. మంత్రి పొన్నం హుస్నాబాద్ వైపు వస్తూ.. రోడ్డుపై వెళ్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

● ఎస్ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట, ఆగస్టు 30: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమని చెప్పారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో చాలా వరకు నేరాలు, దోపిడీలు తగ్గాయన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ గోవింద్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో

నిందితునికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 30 : మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో నేరం రుజువుకావడంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయాధికారి జయంతి శుక్రవారం తీర్పునిచ్చారు. సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌లోని గండిగూడెంలో ఉండే మూడేళ్ల బాలికపై అదే కాలనీకి చెందిన అభయ్‌కుమార్ గౌతమ్ (25) 2019 ఏప్రిల్ 9న అత్యాచారానికి ఒడిగట్టాడు. అమీన్‌పూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. నిందితుడు అభయ్‌కుమార్ గౌతమ్‌కు జీవితఖైదు శిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 30 : ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నేరానికి నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ శుక్రవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డిలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన అర్జున్‌లాల్‌పై 2017 అక్టోబరు 12న ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన దంగర్ లఖన్‌లాల్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంగారెడ్డి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించాక నేరం రుజువు కావడంతో దంగర్ లఖన్‌లాల్ (48)కి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 30 ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మించి మోసం చేసిన ముగ్గురు సైబర్ నేరగాళ్లను సిద్దిపేట సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లాకు చెందిన కడవెర్గు రామకృష్ణ, గంగాధర అభిషేక్, జీడిగాం ఉమాకాంత్ బెజ్జంకి గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్‌కు వాట్సాప్‌లో లింక్ పంపించారు. ఆ లింక్ ఓపెన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే ఎక్కువ మొత్తంలో వస్తాయని నమ్మబలికారు. వారిని నమ్మిన రాజేంద్రప్రసాద్ ఆన్‌లైన్, గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా పది రోజుల్లో రూ.13,12,017 పంపించాడు. ఆ తర్వాత ముగ్గురిని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయానని గ్రహించిన రాజేంద్రప్రసాద్ జాతీయ సైబర్‌సెల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కాల్‌చేసి వివరాలు తెలియజేశాడు. అలాగే సిద్దిపేట సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు టెక్నాలజీ ఆధారంగా ముగ్గురు నిందితులను శుక్రవారం హైదరాబాద్ హబ్సిగూడ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి నిందితుల నుంచి రూ.50వేలు రికవరీ చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అలరించిన యోగాసనాలు

సిద్దిపేటలో యోగా చాంపియన్‌షిప్ పోటీలు ● పాల్గొన్న 262 మంది.. ఆకట్టుకున్న ప్రదర్శన



ఆసనాలను ప్రదర్శిస్తున్న యోగా సాధకులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 30 : సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని స్థానిక శివానుభవ మండపంలో జిల్లా యోగా చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. యోగా పోటీల్లో సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి 262 మంది పాల్గొని యోగాసనాలను ప్రదర్శించారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో బాలురు, బాలికలు, పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. సంప్రదాయ, ఆధునిక, ఆర్టిస్టిక్, రిథమిక్, పెయిర్ అంశాల వారీగా పోటీలను నిర్వహించగా యోగా సాధకులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉదయం జరిగిన ప్రారంభ సమావేశంలో సిద్దిపేట జిల్లా జేఏసీ చైర్మన్ గ్యాదరి పరమేశ్వర్, బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా వర్కింగ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు రంగాచారి,యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ యోగాధ్యయన పరిషత్ సభ్యులు తోట సతీష్, మండల విద్యాధికారి యాదవరెడ్డి, పోటీ పరిశీలకులు, ప్రముఖ యోగా గురువు కరణం గణేష్ కుమార్, ఎస్‌జీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, తదితరులు పోటీలను ప్రారంభించారు. జిల్లా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, రాష్ట్ర స్థాయిలో గెలిస్తే జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.

మెదక్‌లో హీరో నవీన్‌చంద్ర సందడి

మెదక్ కల్చరల్, ఆగస్టు 30 : మెదక్ పట్టణం గోల్కొండ వీధి ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన లెజెండ్ అవుట్ ఫిట్టర్స్ వస్త్ర షోరూమ్‌ని ప్రముఖ తెలుగు నటుడు, హీరో నవీన్‌చంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి మెదక్‌కి వచ్చానని, ఇక్కడి ప్రజలు తనను ఎంతో ప్రేమతో ఆదరించడం సంతోషం కలిగిస్తుందన్నారు. ఎంతో కాలంగా తన ఆత్మీయ స్నేహితులైన రాజు, శ్రీనివాస్ లెజెండ్ అవుట్ ఫిట్టర్‌షాప్‌ని ఏర్పాటు చేశారని తెలిపారు. లెజెండ్ అవుట్ ఫిట్టర్ ఎండీ రాజు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తమ మొదటి బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని, మెదక్ యువతకి చిన్నారుల కోసం ఇక్కడ మరో బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సంస్థ ప్రతినిధులు బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హీరో నవీన్‌చంద్ర

కుక్కను తప్పించబోయి.. అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

● ఒకరి పరిస్థితి విషమం.. ఇద్దరికి స్వల్ప గాయాలు

● అందరూ ఉపాధ్యాయులే

కుకునూరుపల్లి, ఆగస్టు 30 : కుక్కను తప్పించబోయి, అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఓ కారు ఢీకొన్న ఘటన కుకునూరుపల్లి శివారులో రాజీవ్ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్నది. ఈ ప్రమాదంలో ముగ్గురు ఉపాధ్యాయులకు గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. వివరాల్లోకి వెళితే.. కుకునూరుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు చైతన్య కారులో సిద్దిపేట నుంచి కుకునూరుపల్లి పాఠశాలకు విధుల నిమిత్తం వస్తున్నారు. కుకునూరుపల్లి శివారులో రాజీవ్ రహదారిపై కుక్క అడ్డు రావడంతో దానిని తప్పించబోయి కారు అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టారు. కారు ముందు భాగంలో కూర్చున్న వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడగా ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరు టీచర్లు మల్లారెడ్డి, చైతన్య స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వారిని సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గొంతులో కత్తితో పొడుచుకుని వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● డయల్ 100కు ఫోన్ చేసి స్వయంగా తెలిపిన వృద్ధుడు

గజ్వేల్, ఆగస్టు 30 : గొంతులో కత్తి పొడుచుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్లలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా మన్నెవారి తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల రాజయ్య(65) డయల్ 100కు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకోగా కత్తితో గొంతులో పొడుచుకోవడం గమనించారు. ఒంటిపై రక్తంతో పడి ఉన్న రాజయ్యను వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వెంటనే రాజయ్య కుటుంబసభ్యులకు, బంధువులకు సమాచారాన్ని అందజేసిన పోలీసులు, వివరాలను సేకరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోధా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


నవీన్(ఫైల్)

దుబ్బాక, ఆగస్టు 30 : అప్పుల బాధతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం దుబ్బాకలో వెలుగుచూసింది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన తుమ్మ నవీన్(25)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. డబుల్ బెడ్‌రూం ఇంటిలో నివాసం ఉంటున్నాడు. దుబ్బాకలో సరైన పని దొరకకపోవడంతో నవీన్‌కు అప్పులు పెరిగిపోయాయి. చేసిన అప్పులను తీర్చలేక జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు ఇంటికి రాగా, ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో ఇతరులు సహాయంతో ధ్వంసం చేశారు. అప్పటికే నవీన్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మెదక్‌లో మరో యువకుడి బలవన్మరణం...


సందీప్ (ఫైల్)

మెదక్ అర్బన్, ఆగస్టు 30 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు కథనం ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన సందీప్(34) నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి వాళ్లను కొట్టాడు. దాంతో తల్లిదండ్రులు నర్సాపూర్‌కు వెళ్లగా.. సందీప్ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజుల నుంచి ఫోన్ చేస్తే సమాధానం రాకపోవడంతో సందీప్ తండ్రి విశ్రాంత అధ్యాపకుడైన సంగమేశ్వర్ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. పోలీసులు వెంకటేశ్వరకాలనీలోని ఇంటికి వెళ్లగా ఉరేసుకుని కనిపించాడు. ఆత్మహత్య చేసుకుని మూడు రోజులు కావడంతో మృతదేహం కుళ్లింది. సందీప్ అన్ని వివాదాల్లో జోక్యం చేసుకునేవాడు గతంలో పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు. ఇటీవల పెట్రోల్ లేదని కారును తగలపెట్టాడు. బాలింత, పనిపిల్లపై కిరోసిన్ పోసేందుకు యత్నించి జైలుకు వెళ్లి వచ్చాడు. పలు కేసుల్లో శిక్షలు అనుభవించిన సందీప్ మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పట్టణ పోలీసులు వెల్లడించారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరి మృతి


అనిల్‌కుమార్ మృతదేహం

పాపన్నపేట, ఆగస్టు 30 : ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన వనదుర్గా ప్రాజెక్టు ఎఫ్ఎన్ కెనాల్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం మేరకు... మెదక్‌కు చెందిన తూర్పు అనిల్‌కుమార్(30) వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం సాయంత్రం కుటుంబీకులతో కలిసి ఏడుపాయలకు వచ్చి అక్కడే ఉన్నాడు. శుక్రవారం స్నానం చేసేందుకు వన దుర్గా ప్రాజెక్టు ఎఫ్ఎన్ కెనాల్ వద్దకు వెళ్లారు. అనిల్ కుమార్ నీటిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగాడు. అక్కడే ఉన్న కుటుంబీకులు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. స్థానికులు గాలించగా ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి వచ్చి గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన భెల్ కార్మికుడిపై కేసు

రామచంద్రాపురం, ఆగస్టు 30 : యువతి పట్ల అసభ్యంగా వ్యవరించిన బీహెచ్ఈఎల్(భెల్) కార్మికుడిపై రామచంద్రాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. భెల్ ఎల్ఐజీ కాలనీలో నివాసముంటున్న శక్తి శ్రీనిధి(20) కొండాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. రోజులాగే రాత్రి 8 గంటల సమయంలో బీహెచ్ఈఎల్ మీదుగా తన బంధువుతో ఇంటికి వెళ్తున్నది. ఈ క్రమంలో ఆమె బంధువు మూత్ర విసర్జనకు బైక్ ఆపి పక్కకు వెళ్లాడు. ఇదే సమయంలో భెల్ సెక్యూరిటీ వాహనం ఆమె వద్దకు వచ్చి నిలిచింది. అందులో నుంచి బయటకు దిగిన వ్యక్తి ఇక్కడ ఏం చేస్తున్నావ్? అంటూ దుర్భాషలకు దిగాడు. ఇంతలో ఆమె బంధువు వచ్చి ఏం జరిగిందని ప్రశ్నిస్తున్నండగా జీపులోని ముగ్గురు వ్యక్తులు కర్రలతో వారిని చితకబాదారు. అంతటితో ఆగకుండా సదరు యువతి ముఖంపై లైట్లు వేసి వీడియో చిత్రీకరిస్తూ 'నా పేరు గణేష్... నేను భెల్ ఉద్యోగిని' ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దురుసుగా వ్యవరించారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లిన సదరు మహిళ శుక్రవారం ఉదయం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సీఐ జగన్నాథ్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

● తులం బంగారం, 60 తులాల వెండి, నగదు స్వాధీనం

వర్గల్, ఆగస్టు 30 : తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా ఎంచుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం గౌరారం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.18,000 నగదుతో పాటు, తులం బంగారం, 60 తులాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామంలో ఈ నెల 9న తాళం వేసి ఉన్న పది ఇళ్లల్లో వరుస చోరీలకు పాల్పడి నగదుతో పాటు బంగారం వెండి వస్తువులు దోచుకెళ్లిన విషయం తెలిసిందే. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు శుక్రవారం ఉదయం మండలంలోని శాఖారం చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని విచారించారు. అంబర్‌పేట గ్రామానికి చెందిన వల్లపు రాజు(29) 20 రోజుల క్రిందట సొంత గ్రామమైన అంబర్‌పేటలో పది ఇండ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అలాగే జూలైలో గజ్వేల్ పట్టణంలోని రెండు ఇళ్లల్లో దొంగతనం చేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బైక్‌తో పాటు తులం బంగారం, అరవై తులాల వెండి వస్తువులు, రూ.18,000 నగదును స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

టెన్నికాయిట్ ఎంపిక పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవి

సిద్దిపేట టౌన్, ఆగస్టు 30 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో టెన్నికాయిట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ అండర్ 14 బాలబాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీదేవి, హ్యాండ్ బాల్ కోచ్ తుమ్మల కనకయ్య, వెయిట్ లిఫ్టింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో తన్విక (బెజ్జంకి), లక్ష్మీవైష్ణవి(సిద్దిపేట), నివేదిత(బెజ్జంకి), అర్చన(సిద్దిపేట), కీర్తి(కుకునూరుపల్లి), బాలుర విభాగంలో దినేష్(సిద్దిపేట), చందు(సిద్దిపేట), చరణ్(సిద్దిపేట), రక్షిత్‌ప్రభ(హుస్నాబాద్), శ్రీనాథ్(హుస్నాబాద్) ఎంపికైనట్లు నిర్వహకులు తెలిపారు.

ఎస్టీ, ఎస్సీలను అక్రమ కేసుల్లో ఇరికిస్తే సహించేది లేదు

● న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు శాఖలు పనిచేయాలి

● కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 30 : ఎస్సీ, ఎస్సీలను అనవసరంగా అక్రమ కేసుల్లో ఇరికిస్తే సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులు, కుల సంఘాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు శాఖలు పనిచేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, జిల్లా స్థాయి అధికారులు గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను తరచూ తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే అధికారులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళితులకు ఎక్కడ సమస్యలు ఎదురైతే కమిషన్ అక్కడికి వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రకాల కేసులను సెప్టెంబర్ నెలాఖరులో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయన పోలీసులను ఆదేశించారు. నెలరోజుకోసారి ఎస్సీ, ఎస్టీ సమస్యలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీలకు బక్కి వెంకటయ్య సూచించారు.

విధిగా అధికారుల తనిఖీలు : కలెక్టర్ క్రాంతి

విద్యార్థులకు మంచి విద్య, భోజనం అందజేసేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను అధికారులు విధిగా తనిఖీ చేయాలని, పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. భూ సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో సివిల్ డే కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్యను టీఎన్‌జీవో నాయకులు, దళిత, గిరిజన నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జగదీష్, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసే వరకు రాజీలేని పోరాటం

● టీజీఈజేఏసీ చైర్మన్ జావేద్‌అలీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 : సీపీఎస్‌ను రద్దు చేసే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని టీజీఈజేఏసీ చైర్మన్ జావేద్‌అలీ తెలిపారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో శుక్రవారం పెన్షన్ విద్రోహ దినం(సెప్టెంబరు 1)న పురస్కరించుకొని సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జావేద్‌అలీ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. కో చైర్మన్ వైద్యనాథ్ మాట్లాడుతూ సెప్టెంబరు 1న నిర్వహించే కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ 1న ఐబీ నుంచి కొత్త బస్టాండ్ వరకు జరిగే ర్యాలీలో ఉద్యోగులు ఐక్యతగా పాల్గొని మరోసారి ఆవశ్యకత తెలియజేయాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ మాట్లాడుతూ ఉద్యోగులందరూ సంఘటితంగా పోరాడి సీపీఎస్ విధానాన్ని పారదోలే వరకు పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు వేణుగోపాలస్వామి, శ్రీనివాస్‌రాథోడ్, శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, అంజయ్య మురళీధర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న భారీ ర్యాలీ : టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్ అర్బన్, ఆగస్టు 30: నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సంఘ భవన్‌లో ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెన్షన్ విద్రోహదిన సన్నాహక సమావేశంలో భాగస్వామ్య సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ.. ఆదివారం ఉదయం 10 గంటలకు టీఎన్జీవో భవన్ నుంచి స్థానిక రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ట్రెసా, తపస్ టీపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్, టీటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌గౌడ్, ఎల్లం, సంగయ్య, రాజ్‌గోపాల్‌గౌడ్, పద్మరావు, శివయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్‌చంద్ర, టీపీటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు యాదగిరి, హీరాలాల్, టీఎన్జీవో నాయకులు ఫణిరాజ్, ఫజులొద్దీన్, రిటైర్డ్ ఎంప్లాయీస్ మనోహర్, మధు తదితరులు పాల్గొన్నారు.




సంగారెడ్డిలో సన్నాహక సమావేశంలో పాల్గొన్న టీజీఈజేఏసీ నాయకులు, మెదక్‌లో అభివాదం తెలుపుతున్న ఐక్య కార్యాచరణ సమితి ఉద్యోగులు

పదవీవిరమణ రోజే పెన్షన్ ఆర్డర్లు

● ప్రయాస్ కార్యక్రమం ద్వారా మెరుగైన సేవలు

● భవిష్య నిధి ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు, ఆగస్టు 30: పదవీవిరమణ చేసిన రోజే పీఎఫ్ పెన్షన్ పత్రాలను అందజేస్తున్నామని భవిష్యనిధి పటాన్‌చెరు ప్రాంతీయ కార్యాలయం కమిషనర్ విశాల్‌అగర్వాల్ పేర్కొన్నారు. వివిధ శాఖల్లో పనిచేసి శుక్రవారం పదవీవిమరణ చేసిన 28 మంది పీఎఫ్ ఖాతాదారులకు కార్యాలయంలోనే పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు సత్వర సేవలు అందించేందుకు ప్రయాస్ అనే వినూత్న కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. పదవీ విమరణ చేసిన రోజే పూర్తి పీఎఫ్ సెటిల్‌మెంట్‌తో పాటు పెన్షన్ పత్రాలను సిద్ధం చేసి అందజేస్తున్నామన్నారు. ఖాతాదారులు పలు మార్లు పీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరగనవసరం లేకుండా వారి ముంగిట్లోకే సేవలను తీసుకెళుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్-2, శ్రీదేవి, అకౌంట్ అధికారి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పన్నులు తగ్గించే వరకు పోరాటం ఆగదు

● తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్


మాట్లాడుతున్న రాఘవేందర్‌గౌడ్

తూప్రాన్, ఆగస్టు 30: తూప్రాన్ మున్సిపాలిటీలో రాష్ట్రంలో ఎక్కడ లేనంతగా అడ్డగోలుగా పెంచిన ఇంటి పన్నులను తగ్గించే వరకు పోరాటం ఆగదని మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని, అవసరమైతే బంద్‌లు, దీక్షలు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం తూప్రాన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచిన పన్నులు తగ్గించే వరకు పన్ను కట్టవద్దని ప్రజలకు సూచించారు. ఇంటి పన్నుల పెంపుపై తన హయాంలో నిర్ణయం తీసుకున్నట్లు చేసిన ఆరోపణలు అబద్ధమన్నారు. తీర్మానం చేసినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానన్నారు. ఇంటి పన్ను పెంపును ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. వ్యక్తిగత దూషణలపై పరువు నష్టం దావా వేస్తానంటు హెచ్చరించారు. మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ ఎవరని? భార్యభర్త కూర్చొని రివ్యూ మీటింగ్ చేయడమేంటని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సత్యలింగం, బొంది వెంకట్‌గౌడ్, సత్తార్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పొట్లపల్లి పారిశుధ్య కార్మికుడికి జాతీయ పురస్కారం


విజయవాడలో పురస్కారాన్ని అందుకుంటున్న లక్ష్మణ్

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 30: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు లక్ష్మణ్‌కు జాతీయ పురస్కారం లభించింది. తెలుగుభాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ టీచర్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 29న విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో పురస్కారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పొట్లపల్లిలో లక్ష్మణ్ పంచాయతీ కార్మికుడిగా అంకిత భావంతో సేవలందించడాన్ని గుర్తించి గిడుగు రామమూర్తి సేవారత్న జాతీయ పురస్కారాన్ని అక్కడి స్థానిక ఎమ్మెల్యే నలిమెల రామకృష్ణారెడ్డి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, టీచర్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడునాగేశ్వర్ అందజేశారు. లక్ష్మణ్‌కు జాతీయ పురస్కారం రావడంతో పట్ల శాలీవాహన సంఘం అధ్యక్షుడు కానుగుల మోహన్, మాజీ ఎంపీపీ దేవసాని నిర్మల, మాజీ సర్పంచ్ దేవసాని సుశీల, గ్రామస్థులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తంచేశారు.



రూ.5 నాణేలతో అమ్మవారి చిత్రం

శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవి రూపాన్ని రూ.5 నాణేలతో గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు ఆవిష్కరించారు. - గజ్వేల్

వెల్టూర్ ఉపాధ్యాయుడికి గురుబ్రహ్మ బంగారు నంది అవార్డు


మల్లికార్జున్‌గౌడ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30 : విద్యారంగంలో చేసిన సేవలకుగాను సదాశివపేట మండలం వెల్టూర్ ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌గౌడ్ గురుబ్రహ్మ బంగారు నంది అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 8న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో మల్లికార్జున్‌గౌడ్ అవార్డును అందుకోనున్నారు. అవార్డుకు ఎంపిక చేసినందుకుగాను వల్లూరి ఫౌండేషన్‌కు మల్లికార్జున్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అంతరిక్షయానంపై అవగాహన

వెల్దుర్తి, ఆగస్టు 30 : వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అంతరిక్షయానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, ఇస్రో శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఎంఈవో యాదగిరి హాజరై మాట్లాడారు. దేశ నిర్మాణం తరగతి గదుల్లోనే మొదలవుతుందని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని వారు సూచించారు. ఒకప్పుడు అంతరిక్షయానంలో అమెరికా, చైనా, రష్యా వంటి దేశాలపై ఆధారపడేదని, ఇప్పుడు ఇండియా ముందు ఉండడం అందరికీ ఎంతో గర్వకారణమన్నారు. అంతకముందు ఇస్రో శాస్త్రవేత్త డా.శ్రీనివాస్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చంద్రయాన్, గగన్‌యాన్, మంగళ్‌యాన్, ఇస్రో రాకెట్ ప్రయోగాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం ఇస్రో బస్సులో అంతరిక్ష ప్రయోగాల వివిధ నమూనాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంతరిక్ష ప్రయోగాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

వైభవంగా పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం

- చివరి శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయాల్లో మహిళల పూజలు

చిన్నకోడూరు, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని చౌడారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు పెద్దమ్మ పెద్దిరాజును దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, తమ పిల్లపాపలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెండ్యాల బాలయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకిష్టాపూర్‌లో బోనాలు

కుకునూరుపల్లి, ఆగస్టు 30: గ్రామ దేవతలకు కిష్టాపూర్ గ్రామస్థులు బోనాలు సమర్పించారు. గ్రామంలోని గ్రామదేవతలైన దుర్గమ్మ, మహంకాళి ఎల్లమ్మ దేవతలకు శుక్రవారం బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుల్ల నడుమ బోనాలు సమర్పించి తమ గ్రామాన్ని చల్లంగా చూడమని వేడుకున్నారు.

సామూహిక గౌరీ వ్రతం, కుంకుమార్చన

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో సిద్దిపేటలోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని శ్రీ గౌరీనీలకంఠేశ్వరాలయంలో విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. నీలకంఠ సమాజం ఆధ్వర్యంలో సామూహిక గౌరీ వ్రతం, కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రంజిత్‌కుమార్, నీలకంఠ సమాజం కమిటీ అధ్యక్షుడు యోగేశ్వర్ మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మహిళలు, నీలకంఠం సమాజం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన

గజ్వేల్, ఆగస్టు 30: గజ్వేల్ పట్టణంలోని శ్రీసీతారామ, ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. గోపూజ, అమ్మవారికి లక్ష పుష్పార్చన, సామూహిక వాసవీ పారాయణం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్యలు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ సభ్యులను సన్మానించారు.



సిద్దిపేట కల్చరల్: సామూహిక గౌరీవ్రతం, కుంకుమార్చనలో మహిళలు

వెండి హారం సమర్పించిన మాజీ ఎమ్మెల్యే

హుస్నాబాద్, ఆగస్టు 30: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవికి మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, షమిత దంపతులు శుక్రవారం రూ. 1.50 లక్షల విలువైన వెండి హారాన్ని సమర్పించారు. ఎల్లమ్మ దేవిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. అమ్మ వారికి వెండి హారాన్ని సమర్పించి మొక్కు తీర్చుకున్నానని వెల్లడించారు. అనంతరం దేవస్థాన కమిటీ సతీష్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్ తనయుడు ఇంద్రనీల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ. అన్వర్, మాజీ ఎంపీపీలు మానస, లక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు భూక్య మంగ, వినీత, ప్రభాకర్‌రెడ్డి, ఆకుల వెంకట్, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, రవీందర్ తదితరులున్నారు.



గజ్వేల్: శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న మహిళలు



కుకునూరుపల్లి: బోనాలతో ఊరేగింపుగా దుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న గ్రామస్థులు



హుస్నాబాద్: రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ దంపతులు

చినుకు పడితే.. చిత్తడే



ఇది సిద్దిపేట ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఎదురుగా ఉన్న కుషాల్‌నగర్ రోడ్డు దుస్థితి. సరైన రోడ్డు లేకపోవడంతో చినుకు పడితే చాలు బురదమయంగా మారుతున్నది. మట్టి రోడ్డు కావడంతో జాగ్రత్తగా నడపకపోతే వాహనం అదుపుతప్పే ప్రమాదం పొంచి ఉన్నది. చిన్న వర్షం పడినా బయటకు రావలంటే స్థానికులు, వాహనదారులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

\- సిద్దిపేట ఫొటోగ్రాఫర్

అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



బెజ్జంకి, ఆగస్టు 30: లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటన మండలంలోని గాగిల్లాపూర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ గాగిల్లాపూర్ రాజీవ్‌రహదారి స్టేజి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌పై నుంచి కొంత దూరం ముందుకెళ్లి రోడ్డు పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి లారీపై ఒరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై కేసు

కోహెడ, ఆగస్టు 30: మండలంలోని వింజపల్లి, బస్వాపూర్ గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను శుక్రవారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వింజపల్లి గ్రామంలోని వాగు నుంచి బొలెరో వాహనంలో ఇసుక తరలిస్తున్న గికురు శంకర్, గర్రెపల్లి శ్రావన్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే బస్వాపూర్ గ్రామంలో చామంతుల తిరుపతి ట్రాక్టర్‌లో మోయాతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి 'పొన్నం' ఇంటి నిర్మాణానికి భూమిపూజ

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 30: రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సొంత నివాసంతో పాటు, కార్యాలయ నిర్మాణం కోసం శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, సీనియర్ నాయకులు మడప జైపాల్‌రెడ్డి, కార్యకర్తల ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. మంత్రి సొంత స్థలంలో తను నివాసం ఉండేందుకు ప్రత్యేక భవనం, మంత్రిని కలిసేందుకు వచ్చే వారి కోసం ప్రత్యేక కార్యాలయం, సభలు, సమావేశాలు నిర్వహించుకునే విధంగా విశాలమైన హాల్‌ను నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

మద్దూరు, ఆగస్టు 30: రుణమాఫీ కాని రైతుల వివరాల్ని సేకరిస్తూ ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు మండల ఏవో బి. రామకృష్ణ తెలిపారు. మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి సర్వే చేపట్టి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేకు వచ్చినప్పుడు కుటుంబానికి సంబంధించిన వివరాలు అందించాలని కోరారు. మండలంలో 408 మంది రైతులను గుర్తించగా ఇప్పటి వరకు 69 కుటుంబాలను నిర్ధారణ చేసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఆయనవెంట ఏఈవో కల్పన ఉన్నారు.

- **మిరుదొడ్డి:** మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని జంగపల్లి గ్రామాల్లో మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల వ్యవసాయాధికారులు మల్లేశం, సత్యాన్వేష్‌లు వేరువేరుగా రైతుల వివరాల ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రుణ మాఫీ లబ్ధిదారులుగా ఉండి రేషన్‌కార్డు లేని వారి కుటుంబసభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. వారి వెంట ఏఈవో లోహిత్ తదితరులున్నారు.
- **దూళిమిట్ట:** రుణమాఫీ కాని రైతులు వచ్చే నెల 9వ తేదీ వరకు సవరించుకోవాలని ఎంఏవో అఫ్రోజ్ ఒక ప్రకటనలో తెలిపారు.



మిరుదొడ్డిలో కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేసి సెల్ఫీతీసుకుంటున్న ఏవో మల్లేశం

మున్సిపాలిటీలో పారిశుధ్యానికి పెద్దపీట

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య
- ఫ్రైడే డ్రైడే సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో పర్యటించిన అధికారులు

గజ్వేల్, ఆగస్టు 30: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్ద శుక్రవారం పారిశుధ్య పనులు చేయించారు. పట్టణంలోని రోడ్లను, మురుగుకాలువలను శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. ఆయనవెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సిబ్బంది ఉన్నారు.

- **మద్దూరు:** దోమలకు ఆవాసాలైన నీటి నిల్వలు లేకుండా చూడాలని పంచాయతీ సెక్రటరీ మాదవ్ జాదవ్ గ్రామస్తులకు సూచించారు. డ్రై డేను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని రేబర్తి గ్రామంలో స్థానిక పంచాయతీ, వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నీటి నిల్వలున్న ఇళ్లల్లోని నీళ్లను పారబోశారు. నీటి తొట్టిల్లో ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని పట్టుకుని వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.
- **సిద్దిపేట రూరల్:** పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఏఎన్‌ఎం బాలమణి తెలిపారు. నారాయణరావుపేట మండలం మల్యాలలో శుక్రవారం ఫ్రైడే డ్రైడేని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేడి చేసి కాచిన నీటినే తాగాలని చెప్పారు. గ్రామంలోని ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్: ఎడ్యుకేషన్ హబ్‌లో సిబ్బందితో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య



మద్దూరు: రేబర్తిలో నీటిని పారబోస్తున్న సెక్రటరీ

హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేయాలి

చేర్యాల, ఆగస్టు 30: గ్రామాల్లో విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటుచేయాలని కోరుతూ కొమురవెల్లి మండల సీపీఎం నాయకులు శుక్రవారం పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరన్ ఆచార్యకు వినతి పత్రం అందించారు. హెల్త్‌క్యాంపులు ఏర్పాటుచేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

- మంత్రి 'పొన్నం'కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 30: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ ఏబీసీడీలను అమలు చేసి మాదిగలకు, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, నాయకులు గోసికంటి హరికిషన్, కోకన్వీనర్ ముక్కెర సంపత్‌కుమార్, బత్తుల చంద్రమౌళి, తొందూరి ఎల్లయ్య, గడిపె కొమురయ్య, కొమ్ముల సంపత్, యాదగిరి, దేవేందర్, సాయన్న, అశోక్, హరీశ్ తదితరులున్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

'బీసీ కులగణనపై వెంటనే ప్రకటన చేయాలి'

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 30: బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్లపై వెంటనే ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీల కులగణన చేయాలని ఐదు రోజులుగా బీసీ నాయకులు ఆమరణ దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. బీసీ నాయకులు చేస్తున్న దీక్షను భగ్నం చేసేందుకు వారిని అరెస్ట్ చేసి గాంధీ ఆస్పత్రికి తరలించినా వారు నిరాహార దీక్ష విరమించలేదని తెలిపారు. ఇప్పటికైనా బీసీ గణన చేయాలని డిమాండ్ చేశారు.

నేడు 'బాట ముచ్చట' పుస్తకావిష్కరణ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 30: సమకాలీన సామాజిక పరిస్థితులను విశ్లేషిస్తూ సిద్దిపేటకు చెందిన దారం మల్లారెడ్డి రచించిన బాట ముచ్చట అనే పుస్తకావిష్కరణ నేటి మధ్యాహ్నం 2 గంటలకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వహణ సభ్యులు కే. రంగాచారి, జి. తిరుపతి రెడ్డి, గ్యాదరి పరమేశ్వర్, జి. సత్తయ్య విక్రంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఖాతా రవీందర్ తెలిపారు. రచయిత దారం మల్లారెడ్డి తన జీవితంలో జరిగిన సంఘటనల్లోంచి, సామాజిక మార్పు కోసం జరుగుతున్న పోరాటాలను విశ్లేషిస్తూ బాట ముచ్చట పుస్తకం రాశారని పేర్కొన్నారు. ఈ పుస్తకావిష్కరణ సభకు ప్రఖ్యాత కవి, సరస్వతి సమ్మాన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి, వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, ప్రఖ్యాత కవి, రచయిత డా. నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్, జి. లచ్చయ్య, ఏ. రాంచంద్రం, జి. సత్తయ్య, కొండల్‌రెడ్డి, పెంటయ్య శ్రీధర్, జి. తిరుపతిరెడ్డి తదితరులు హజరవుతున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడికి ఆత్మీయ వీడ్కోలు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 30: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెలుతున్న ఉపాధ్యాయుడు శంకర్‌నాయక్‌కు శుక్రవారం విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సుదీర్ఘకాలంగా పాఠశాలలో పనిచేసిన శంకర్‌నాయక్‌ను ఘనంగా సత్కరించారు. క్రమశిక్షణతో బోధన చేసిన ఉపాధ్యాయుడు శంకర్ బదిలీ కావడంతో విద్యార్థులు కంటతడిపెట్టారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 30: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 9 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి విచారణ చేసి 9 మందికి రూ.15,000 జరిమానా విధించారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

చేర్యాల, ఆగస్టు 30: ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ అమలు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ఈరు భూమయ్య డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక లోపాల పేరిట రైతులను ఇబ్బందులుపెడుతుండడంతో అయోమయం చెందుతున్నారని, ప్రభుత్వం స్పందించి షరతులేవీ లేకుండా రుణమాఫీ చేసి కొత్తరుణాలు అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఎల్లయ్య, మల్లేశం, రాములు, శ్రీధర్, శంకరయ్య పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడండి

- తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన బెక్కల్ గ్రామస్థులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

దూళిమిట్ట, ఆగస్టు 30: మండలంలోని బెక్కల్ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ భూములను కొందరు వ్యక్తులు దొంగ పట్టాలు చేసుకుని కబ్జా చేస్తున్నారని, వారి నుంచి ఆలయ భూములను కాపాడాలని కోరుతూ.. బెక్కల్ గ్రామస్థులు శుక్రవారం దూళిమిట్ట తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామలింగేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన సుమారు మూడు ఎకరాల భూమిని కొందరు అక్రమంగా పట్టా చేయించుకుని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు సత్వరమే స్పందించి ఆలయ భూములను రక్షించి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చొప్పరి మల్లేషం, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ షాప్ మంజూరు చేయాలి'

నంగునూరు, ఆగస్టు 30: మండలంలో ఐదు సంవత్సరాల క్రితం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిన జేపీతండాకు రేషన్ షాప్ మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో కమిషనర్ డీఎస్. చౌహాన్‌కు గ్రామ మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల క్రితం ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసినప్పటికీ రేషన్ షాప్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్

గిట్టుబాటు కాని కుట్టుకూలీకి ఎదురుచూపులే!?

- పాఠశాలల పునఃప్రారంభం నాటికి యూనిఫామ్స్ సిద్ధం చేసిన టైలర్లు
- అయినా కూలీ కోసం తప్పని పడిగాపులు

మద్దూరు, ఆగస్టు 30: పాఠశాలలు తెరుచుకునే నాటికి శ్రమించి విద్యార్థులకు యూనిఫామ్స్ అందించి మూడు నెలలు గడుస్తున్నా కుట్టు కూలీ కోసం ఎదురుచూపులు తప్పడం లేదని స్థానిక టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టైలర్లకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే పనిని ప్రభుత్వం అప్పగించింది. పాఠశాలలు తెరిచే నాటికి అందించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించి ఒక్కో జతకు కుట్టుకూలీగా రూ. 50 లు చెల్లిస్తామని చెప్పడంతో టైలర్లు విముఖత చూపించారు. మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని చెప్పి భవిష్యత్తులో అంతా మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు కొనసాగనున్నట్లు చెప్పి యూనిఫామ్స్ కుట్టేందుకు ఒప్పించారు. దీంతో జిల్లా కేంద్రం నుంచి కొలతల ప్రకారంగా కటింగ్ చేసి వచ్చిన క్లాత్‌ను స్థానిక టైలర్లకు మహిళా సంఘాలు చేరవేశాయి. మద్దూరు ఉమ్మడి మండలంలోని 39 పాఠశాలల్లోని 2740 మంది విద్యార్థులకు యూనిఫామ్స్‌ను పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అందించినా కుట్టుకూలీ మాత్రం అందకపోవడంతో స్థానిక టైలర్లకు ఎదురుచూపులే మిగిలాయి. ఒక్కో జతకు కటింగ్, ఖాజాలు, గుండీలకు కలిపి రూ. 16లు చెల్లించగా, ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.4ల చొప్పున తీసేయగా మిగిలేది రూ.30లేనంటూ వాపోతున్నారు. ఒక్కో డ్రెస్సుకు రూ.75 లు చెల్లిస్తామని చెప్పి సర్క్యులర్ వచ్చిందని చెప్పినా అందని ద్రాక్షగా మిగిలిందంటున్నారు. రెండో జత తయారీని జిల్లా కేంద్రంలోనే అప్పగించడంతో శ్రమదోపిడికి గురయ్యామని కుట్టుకూలీ అందించాలని టైలర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

- జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి



సన్మాన సభలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్, ఆగస్టు 30: ప్రతీ ఉద్యోగి ఉద్యోగ విరమణ చేయాల్సిందేనని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి. శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయునిగా సన్మానం పొందారని గుర్తుచేశారు.

పర్యావరణంపై ఉపన్యాస పోటీలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 30: సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం సేవ్ ఎర్త్ సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ బెజ్జంకి కార్యవర్గం ఎన్నిక

బెజ్జంకి, ఆగస్టు 30: డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బీవీ. ప్రవీణ్‌కుమార్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బోనాల రాజేందర్ పర్యవేక్షణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుల్లూరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా ఐలేని రవీందర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలుగా కె. వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా తప్పెట ఓదయ్య, కార్యదర్శులుగా మనోహర్‌రెడ్డి, మహేందర్, మునీర్ అహ్మద్, జిల్లా కౌన్సిలర్‌లుగా ప్రవీణ్‌కుమార్, రాజేందర్, భరత్‌రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రాములు, సభ్యులుగా రాజమౌళి, సుమలతను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- మిరుదొడ్డి డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఎంపీడీవో గణేష్



పాఠశాలలో విద్యార్థులకు వండే బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మిరుదొడ్డి, ఆగస్టు 30: విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించాలని మిరుదొడ్డి డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి సూచించారు. మిరుదొడ్డిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గురుకుల, ఎస్సీ, బీసీ, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. పాఠశాల పరిసరాలను, విద్యార్థులకు అందించే భోజనాన్ని, కూరగాయలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు డెంగీ పరీక్షలను స్థానిక వైద్యాధికారి సమీనా ఆధ్వర్యంలో నిర్వహించారు. వారివెంట పాఠశాల ప్రత్యేకాధికారి స్వర్ణలత, వైద్యసిబ్బంది తదితరులున్నారు.

మోతెలో పౌరహక్కుల దినోత్సవం

మిరుదొడ్డి,ఆగస్టు 30: అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని మోతెలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఆర్ఐ సంతోష్‌కుమార్ మాట్లాడారు. గ్రామాల్లో అంటరానితనాన్ని ఎవరూ పాటించవద్దని, ఎవరైనా అలా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రవీందర్, ఏఎస్ఐ బాలమల్లయ్య, మాజీ సర్పంచు శ్రీనివాస్, నాయకులు రాజేశ్వర్, గుంటి రమేష్, యాదగిరి, రంజిత్, చంద్రం, సురేష్, సాగర్,మహేష్ తదితరులున్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

- గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్, ఆగస్టు 30: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగ్గా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. వర్గల్ మండలం వేలూర్‌లో గురువారం రాత్రి గౌరారం పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో పోలీస్ కళా బృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరారం ఎస్ఐ కరుణకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉన్నత స్థానాలకు చేరుకోవాలి'

గజ్వేల్ ఆగస్టు 30: చిన్ననాటి నుంచే కష్టపడి చదివి ఉన్నత స్థానం పొంది సమాజ సేవ చేసే స్థాయికి ఎదగాలని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని లోహిత్ సాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ లాప్రో సర్జన్ డాక్టర్ అమిరిశెట్టి భాస్కర్ అన్నారు. తాను చదువుకున్న పాఠశాల అయిన గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రూ.60 వేల విలువైన పుస్తకాలను 10 కంప్యూటర్ డెస్క్ టేబుల్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్న ఊరును కన్నతల్లిని ఎంత ఎత్తుకు ఎదిగినా మరవకూడదన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీముద్దీన్ పాఠశాల యాజమాన్యం డాక్టర్ భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ తల్లితండ్రులు రుక్మారావు, రాధాబాయి తదితరులున్నారు.

బీజేపీ పటిష్ఠతకు సభ్యత్వ నమోదు కీలకం

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లు రాంరెడ్డి

వర్గల్, ఆగస్టు 30: దేశంలో బీజేపీ పటిష్ఠతకు సభ్యత్వ నమోదు అత్యంత కీలకమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, వర్గల్ మండల సభ్యత్వ నమోదు పరిశీలకుడు ఎల్లు రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాచారంలో పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత నమోదులో మండలాన్ని అగ్రస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్, సభ్యత్వ నమోదు కన్వీనర్ తిరుపతిరెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేష్‌గౌడ్ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- **కోహెడ:** సభ్యత్వ నమోదులో లక్ష్యానికి మించి సభ్యత్వాలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కోహెడ మండల కేంద్రంలో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగిరేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పిల్లి నర్సయ్య, సభ్యత్వ నమోదు కన్వీనర్ మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, కోకన్వీనర్ దావా శేఖర్, మాజీ ఎంపీటీసీ తూటి బాపురెడ్డి-సుజాత, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.
- **రాయపోల్:** సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేయాలని, నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించి అగ్రస్థానంలో నిలవాలని జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు కన్వీనర్ బిక్షపతి పిలుపునిచ్చారు. రాయపోల్‌లో మండల బీజేపీ కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, మెదక్ పార్లమెంట్ ఎస్సీ మోర్చా కన్వీనర్ మంకిడి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.
- **చిన్నకోడూరు:** కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు మాతంగి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అక్కి సంతోష్, మండల కార్యదర్శులు రవీందర్, పరుశురాములు, బూత్ అధ్యక్షులు చంద్రం, చంద్రసేనరెడ్డి, క్రిష్టారెడ్డి, నాగరాజు, బీజేవైఎం మండల కార్యదర్శి వేణు, మండల కార్యదర్శి నాగరాజుపాల్గొన్నారు.
- **సిద్దిపేట రూరల్:** పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల బాబు సూచించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ కార్యక్రమాని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చొప్పరి బాబు, కనకయ్య, రవి, స్వామి, రంజిత్, రమేష్, రాజిరెడ్డి, భూమయ్య, బిక్షపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్